క్లుప్తంగా

సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న సీఐటీయూ సబ్బవరం ముఠా సభ్యులు

సబ్బవరం: ముఠా వర్కర్లకు పీఎఫ్,ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని సబ్బవరంలోని ముఠా వర్కర్లు డిమాండ్ చేసారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. తమ డిమాండ్లపై సమావేశంలో చర్చించి సభ్యులతో సంతకాలు సేకరించారు. అనంతరం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆర్. రాము, సీఐటీయూ నాయకురాలు ఉప్పాడ సత్యవతి, ముఠా సంఘం నాయకులు బర్ల రమణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



అదృశ్యమైన చేపల దేముడు

పరవాడ: మండలంలో తిక్కవానిపాలెం గ్రామానికి చెందిన చేపల దేముడు ఈ నెల 6 వతేదీ నుంచి కనిపించడం లేదని అతని భార్య లక్ష్మి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలిలా ఉన్నాయి... చేపల దేముడు ఫార్మాసిటీలోని లారస్ పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. భార్యా భర్తల మధ్య ఈ నెల 5న డబ్బులు విషయంలో గొడవ జరిగింది. మరుసటి రోజు ఉదయం లక్ష్మి ఎస్ఈజెడ్‌లో బ్రాండెక్స్ పరిశ్రమలో విధులకు వెళ్లిపోయింది. ఆరోజు సాయంత్రం ఇంటికి వచ్చిన లక్ష్మికి భర్త దేముడు ఇంట్లో కనిపించడం లేదు. రాత్రికి కూడా ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితులను ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఈశ్వరరావు తెలిపారు.

చందన సమర్పణకు రూ. లక్ష విరాళం



సూపరింటెండెంట్‌కు చెక్కు అందజేస్తున్న దాత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి చందనం సమర్పణ నిమిత్తం నగరానికి చెందిన నాగ జోత్స్న అనే దాత రూ. లక్ష విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ సూపరింటెండెంట్ త్రిమూర్తులకు అందజేశారు. దాతకు దేవస్థానం తరఫున స్వామివారి దర్శనం కల్పించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బీజేపీ జిల్లా అధ్యక్షునిగా మళ్లీ రవీంద్రే



సాక్షి, విశాఖపట్నం : భారతీయ జనతా పార్టీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షునిగా మేడపాటి రవీంద్ర మరోసారి నియమితులయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు శుక్రవారం పలు జిల్లాల అధ్యక్షులను మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖ జిల్లాకు సంబంధించి ప్రస్తుతం అధ్యక్షునిగా ఉన్న రవీంద్రనే కొనసాగిస్తూ ఆదేశాలిచ్చారు. కాగా రవీంద్ర 2019 డిసెంబర్ 31న మొదటిసారి జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పుడు మరోసారి ఆయనకు అవకాశం ఇవ్వడం పట్ల పార్టీ శ్రేణులు అభినందనలు తెలిపారు.

కృష్ణయ్యకు ఊంజల్ సేవ



శ్రీకృష్ణునికి ఉయ్యాల సేవ చేస్తున్న అర్చకులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1 కొండపై వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీ కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని శుక్రవారం వేడుకలు జరిపించారు. అందులో భాగంగా శ్రీ కృష్ణుడికి ఊంజల్ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ కృష్ణ జనన వృత్తాంతం వివరించారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థగోష్ఠి నిర్వహించారు. పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రసాద్ పథకంతో సింహగిరికి మహర్దశ

- రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ



స్కీమ్ పనులకు సంబంధించిన ప్రణాళికను పరిశీలిస్తున్న దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి కేంద్రప్రభుత్వం మంజూరు చేసిన రూ.55కోట్ల ప్రసాద్ పథకం నిధులతో సింహగిరికి మహర్దశ పడుతుందని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ తెలిపారు. ప్రసాద్ పథకం పనులకు సంబంధించి రూపొందించిన డీపీఆర్‌ను ఆయన శుక్రవారం సింహాచలం దేవస్థానంతో అధికారులతో కలిసి పరిశీలించారు. దేవదాయశాఖ, దేవస్థానం, టూరిజంశాఖ అధికారులతో పనులు జరిగే ప్రాంతాల్లో ఫీల్డ్ విజిట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు పూర్తి స్థాయిలో వినియోగపడేలా అభివృద్ధి పనులు జరగాలని, అంతేకాని ఏ పనీ వృథాగా పోకూడదని సూచించారు. ఆలయ ఉత్తర ప్రాంగణంలో ఉన్న ప్రదేశంలో ఈశాన్యం మూలన యాగశాలను నిర్మించే విషయంపై వైదికుల సూచనలను పరిగణలోకి తీసుకున్నామన్నారు. అలాగే ఆలయ ఉత్తరద్వారం ఎదురుగా ఉన్న సువిశాల ప్రదేశంలో క్యూకాంప్లెక్స్ నిర్మాణంపై చేయాలా...వద్దా అన్న విషయంపై పరిశీలన జరిపారు. మాస్టర్‌ప్లాన్‌కు ఎలాంటి విఘాతం కలగకుండా పనులు జరుగుతాయని స్పష్టం చేశారు. కొండదిగువ పురాతన పుష్కరిణి సత్రాన్ని తొలగించి ఆ స్థానంలో జీప్లస్–ఫైవ్ కింద ఆధునిక సదుపాయాలతో సత్రాలను నిర్మిస్తామన్నారు. పుష్కరిణి సత్రం మధ్యలో ప్రస్తుతం ఉన్న పురాతన మండపాన్ని అలేగే ఉంచుతామని తెలిపారు. 1936లో నిర్మించిన ఆగమ పాఠశాలను కూడా వేరే ప్రాంతంలో నిర్మిస్తామన్నారు.అప్పటి వరకు ప్రస్తుతం ఉన్న భవనాన్ని ఆధునీకీకరిస్తామన్నారు. ఈ సందర్భంగా వేద విద్యార్థులతో కొంతసేపు మాట్లాడారు. దేవస్థానం ఈవో కార్యాలయ భవనం కూడా పక్కాగా నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. పాత అడవివరం వైపు నుంచి వచ్చే మార్గంలో ఉన్న రెండో టోల్‌గేట్ వద్ద సువిశాలమైన పార్కింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అవసరమైన స్థలాన్ని పర్యాటకశాఖకు కేటాయిస్తామన్నారు. అలాగే సింహగిరిపై ఉన్న మ్యూజియాన్ని కమిషనర్ సందర్శించారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తర పూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, జ్ఞాపికను ఈవో త్రినాథరావు ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో టూరిజం శాఖ సీఈ సీఎస్ఎన్ మూర్తి, ఈఈ రమేష్, జేఈలు మదన్‌మోహన్, సీతారామ్, దేవదాయశాఖ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస రావు, ఏడీసీ రామచంద్రమోహన్, డీసీ సుజాత, ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్‌రాజ్, దొడ్డి రమణ, దేవస్థానం అధికారులు శ్రీనివాసరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

సబ్బవరం: సైబర్ నేరాలు అధికమవుతున్న తరుణంలో విద్యార్థులంతా అప్రమత్తంగా వ్యవహరిస్తూ మరింత మందికి అవగాహన కల్పించాలని సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సీతాలక్ష్మి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఉమెన్స్ డిగ్నిటీ డేలో ఆమె ప్రసంగించారు. ప్రతి శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళలు, బాలికలు దిశ యాప్ వినియోగంపై అవగాహన కలిగి ఉండాలన్నారు.అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని సమాజాభివృద్ధికి స్త్రీ అక్షరాస్యతా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బి. లక్ష్మి,ఎంవీ రామకృష్ణ, డాక్టర్ గోపాల కృష్ణ, డాక్టర్ ఎల్. గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి రిమాండ్

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీ సింహాద్రి కూడలి సమీపంలో గంజాయి రవాణా చేస్తున్న జోగా సంజీవ రావు, కోడూరు నాగభూషణరావులను పరవాడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలివీ.. సింహాద్రి కూడలి వద్ద గురువారం రాత్రి గంజాయితో వీరు సంచరిస్తున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ధర్మారాయుడుపేటకు చెందిన వీరి నుంచి నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిని శుక్రవారం అనకాపల్లి మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా.. నిందితులకు కోర్టు 14 రోజులు రిమాండ్ విధించిందని సీఐ ఈశ్వరరావు వెల్లడించారు.

ఆధ్యాత్మికం

దేవీపురంలో ప్రత్యేక పూజలు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని శ్రీయంత్ర మహామేరు క్షేత్రంలో సహస్రాక్షి రాజరాజేశ్వరీ అమ్మవారి సన్నిధిలో శ్రావణ మాస ప్రత్యేక పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గురుమాత అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో శ్రావణ లక్ష్మిని అలంకరించడంతో పాటు పంచామృతాభిషేకాలు,సామూహిక కుంకమ పూజలు నిర్వహించారు.అనంతరం మహాలక్ష్మి అమ్మవారికి సహస్ర నామావళి హోమం నిర్వహించారు. జిల్లా నలుమూలలు నుంచి తరలివచ్చిన భక్తులు పూజల్లో పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో శ్రావణలక్ష్మి అమ్మవారు



సహస్ర నామావళి హోమం నిర్వహిస్తున్న భక్తులు

కల్యాణం.. కమనీయం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలోని వేదిక్‌పై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

విశేషంగా లక్ష కుంకుమార్చన

సింహచలం: శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో కొలువుదీరిన సింహవల్లీ తాయారు అమ్మవారికి లక్ష కుంకుమార్చన ఘనంగా జరిగింది. ఉదయం 7నుంచి 9గంటల వరకు అర్చకులు పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సింహవల్లీ తాయారు అమ్మవారి ప్రతినిధులుగా సువర్ణ అమ్మవారు, చతుర్భుజ తాయారు అమ్మవార్ల ఉత్సవ మూర్తులను సింహాసనంపై అధిష్టంపజేశారు. పది మంది అర్చకులు లక్ష నామాలను పఠిస్తూ పది ఆవృతులతో కుంకుమ పూజ నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. పూజలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి శేషవస్త్రాలు, కుంకుమ ప్రసాదం అందజేశారు.

ఘనంగా తిరువీధి

శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సింహవల్లీ తాయారు సన్నిధిలో సహస్రనమార్చాన విశేషంగా నిర్వహించారు. 1001 నామాలు పఠిస్తూ భక్తుల గోత్రనామాలతో అమ్మవారికి కుంకుమార్చన చేశారు. అనంతరం సువర్ణ అమ్మవారు, చతుర్భుజ తాయారు అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో అధిష్టంపజేసి ఆలయ మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. అలాగే దేవస్థానానికి చెందిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి కుంకుమార్చన చేశారు.



సింహవల్లీ తాయారు సన్నిధిలోకుంకుమార్చన నిర్వహిస్తున్న వైదికులు

10న ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

మద్దిలపాలెం: రాష్ట్ర, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు స్వీకరించిన వారిని ఈనెల 10వ తేదీన బాల వికాస్ ఫౌండేషన్ సంస్థ, గాంధీ సెంటర్ సంయుక్తంగా సత్కరిస్తాయని ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. డాక్టర్ బుల్లయ్య కళాశాల ప్రాంగణంలో గల గాంధీ సెంటర్ సెమినార్ హాల్లో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్ర ఉత్తమ అవార్డు పొందిన ఉమా గాంధీ, కె.వి.ఎస్.సుబ్రహ్మణేశ్వరరావు, కె.రాంబాబు, సురేష్‌కుమార్‌లను ఈ సందర్భంగా సత్కరిస్తామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగార్జున యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి వి.బాలమోహన్‌దాస్ హాజరు కానున్నారని తెలిపారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ వృత్తి విద్యా కోర్సులకు అతిథి అధ్యాపకులుగా పనిచేయడానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ పి. మురళీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు అర్హతకు సంబంధించి ధ్రువ పత్రాలతో పాటు దరఖాస్తులను ఈ నెల 16వ తేదీ లోగా కళాశాలలో నేరుగా అందజేయాలన్నారు. జనరల్ ఫౌండేషన్ కోర్స్(జీఎఫ్‌సీ) అధ్యాపక పోస్టులకు సంబంధించి ఎంఏ ఎకనామిక్స్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. కంప్యూటర్ సైన్స్ ఇన్ ఇంజినీరింగ్ కోర్స్(సీఎస్ఈ) వొకేషనల్ అధ్యాపకుడిగా పనిచేయుటకు బీటెక్/ఎంఎస్‌సీ,కంప్యూటర్ సైన్స్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఫిజియో థెరపీ(పీటీ) వొకేషన్ అధ్యాపక పోస్టుకు బీపీటీ/ఎంపీటీ 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు.

కొండ చిలువ కలకలం

భీమునిపట్నం: భీమిలిలో జనవాసాల మధ్యకు వచ్చిన పది అడుగుల కొండ చిలువ కలకలం రేపింది. ఇక్కడి సుభాష్ రోడ్డులో ఉన్న బ్రహ్మకుమారి ఈశ్వరి ఆధ్యాత్మిక కేంద్రం వెనుక భాగంలో ఉన్న తోటవద్ద పెద్ద కొండచిలువను శుక్రవారం గుర్తించారు. వెంటనే పారిశుధ్య అధికారి బి.మహాలక్ష్మినాయుడుకు సమాచారాన్ని అందించారు. వెంటనే ఆయన స్పందించి విశాఖలోని స్నేక్ సేవర్ సొసైటీ నిర్వాహకులు, స్నేక్ క్యాచర్ కిరణ్‌కు సమాచారమిచ్చారు. ఆయన వచ్చి పరిశీలించగా కొండ చిలువ వలలాంటి దానిలో చిక్కుకుని ఉండడంతో దాన్ని బైటకు తీశారు. గాయాలతో ఉన్న కొండచిలువకు ప్రాథమిక చికిత్స అందించారు. దాన్ని తనతో తీసుకు వెళ్లి చికిత్స అందించి, కోలుకున్నాక అడవిలో విడిచిపెడతానని కిరణ్ తెలిపారు. భారీ కొండ చిలువ నివాసాల మధ్యకు రావడంతో చుట్టుపక్కల వారు కాసేపు ఆందోళనకు గురయ్యారు.



కొండ చిలువతో స్నేక్ కిరణ్, స్థానికులు

అక్టోబర్‌లో ఏఎంసీ శతాబ్ది ఉత్సవాలు

మహారాణిపేట : ఆంధ్రా మెడికల్ కళాశాల (ఏఎంసీ) శతాబ్ది ఉత్సవాలను ఈ ఏడాది అక్టోబర్ 27,28,29 తేదీల్లో నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. 27న ఆంధ్రా మెడికల్ కళాశాల (ఏఎంసీ) దినోత్సవం, 28న సెంటినరీ బ్లాక్ నిర్మాణానికి ప్రారంభోత్సవం, 29న అకడమిక్ సెషన్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు. కాగా ఏఎంసీలో వైద్య విద్య అభ్యసించి దేశ, విదేశాల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులు సెంటినరీ బ్లాక్ నిర్మాణానికి విరాళాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. ఈ బ్లాక్ ప్రారంభోత్సవానికి పలువురు ప్రముఖులను ఆహ్వానిస్తున్నట్టు బ్లాక్ నిర్మాణ కమిటీ చైర్మన్ డాక్టర్ జి.రవిరాజ్ తెలిపారు.

అమ్మవారికి 108 పట్టు చీరలు



అమ్మవారి ముందు ఉంచిన 108 పట్టుచీరలు

కొమ్మాది: జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది అష్టలక్ష్మి సన్నిధిలో శ్రావణమాస 4వ శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీనారాయణుల ముందు 108 పట్టు చీరలను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా లక్ష్మీనారాయణ స్వామి వారిని వజ్ర కవచంతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం తోమాల సేవ, శ్రీ లక్ష్మీ హోమం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధరస్వామి తెలిపారు. ప్రతి శ్రావణమాసం 4వ వారం అమ్మవార్లకు 108 పట్టు చీరలు సమర్పించడం అనవాయితీగా వస్తోందని ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు తెలిపారు.

పారిశుధ్య నిర్వహణ గాలికి!



గొల్లగుంటలో మంచినీటి బోరు వద్ద కాలువ తవ్వుతున్న గ్రామస్తుడు

పరవాడ: మండలంలోని రావాడ శివారు గొల్లగుంట గ్రామంలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు కాలువలు శిథిలావస్థకు చేరడం వల్ల ఈ పరిస్థితి తలెత్తిందని వాపోతున్నారు. ప్రజలు వినియోగించిన వాడుక నీరు వీధుల మధ్య, రోడ్లపై నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. తాగు నీటి బోరు వద్ద మురుగు నీరు తొలగించని కారణంగా దోమలు పెరిగిపోయాయన్నారు. బోరు వద్ద మురుగు నీరు పోవడానికి కాలువ లేక ఎక్కడికక్కడ నీరు నిలిచిపోతుంది. ఆ మురుగునీటిని తొలగించడానికి స్థానికులు అష్టకష్టాలు పడుతున్నారు. చెత్తాచెదారాలు, మురుగు వల్ల దోమలు విజృంభించి రాత్రి వేళ కంటి మీద కునుకు లేకుండా పోతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలోని పరిస్థితిపై అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం కనిపించలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి పారిశుధ్య పరిస్థితులను మెరుగుపర్చాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రైవేటీకరణతో కార్మికులకు తీరని నష్టం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణతో కార్మికులకు తీరని నష్టం జరుగుతుందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. వారి భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 939వ రోజుకు చేరుకున్నాయి. ఈ శిబిరంలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వ వైఖరిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కును అమ్మాలని చూడడం అన్యాయమన్నారు. దీనికి వ్యతిరేకంగా విశాఖ ఉక్కు కార్మిక వర్గం ఐక్యంగా ఉద్యమించి స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్సీ సింహాచలం

గాజువాక : త్వరలో నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతం చేయడానికి అందరూ సమష్టిగా కృషి చేయా లని జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం కోరారు. వైద్య, ఆరోగ్య సిబ్బందితో శుక్రవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 30న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. దీనికోసం ఏఎన్ఎంలు, వలంటీర్లు, ఆశ కార్యకర్తలు ఈ నెల 15 నుంచి ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా భావించాలన్నారు. కార్యక్రమంలో గాజువాక పీహెచ్‌సీ సీహెచ్‌వో పి.నాగ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సీపీ త్రివిక్రమ్ వర్మకు ఉత్కృష్ట సేవా పతకం

మరికొంతమందికి కూడా..

దొండపర్తి: నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ ప్రతిష్టాత్మక ఉత్కృష్ట సేవా పతకం లభించింది. ఆయనతో పాటు జిల్లాలో ముగ్గురు సీఐలను, ఒక ఏఎస్ఐతో పాటు 14 మంది హెచ్‌సీలు, 14 మంది కానిస్టేబుళ్లను ఈ పతకానికి ప్రభుత్వం ఎంపిక చేసింది. అలాగే అతి ఉత్కృష్ట సేవా పతకానికి ఒక ఎస్ఐతో పాటు 16 మంది హెచ్‌సీలు ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

ఎంపికైన వారు..

దువ్వాడ సీఐలు బి.శ్రీనివాసరావు, ఎ.వెంకటలీలా రావు, ద్వారకా సబ్‌డివిజన్ క్రైం టి.ఇమాన్యుయల్ రాజు, కంచరపాలెం ఏఎస్ఐ కె.కనకరాజు ఉత్కృష్ట సేవా పతకాన్ని అందుకోనున్నారు. అలాగే హెడ్‌కానిస్టేబుళ్లు ఎం.జీవన్‌కుమార్(సీఏఆర్), జి.వి.రమణ(గోపాలపట్నం ట్రాఫిక్), ఎం.బాలరాజు(పీఎం పాలెం క్రైం), టి.వసంతరావు(సీఎస్‌బీ), జె.ఎం.ఎం.రెడ్డి(పద్మనాభం), జి.శ్రీనివాసరావు(త్రీటౌన్), ఎస్.శ్రీనివాసరావు(దువ్వాడ), డి.సురేష్‌కుమార్(దువ్వాడ క్రైం), ఎ.రమేష్‌కుమార్(దువ్వాడ ట్రాఫిక్), పి.జయసీలన్ (ఎయిర్‌పోర్ట్ ట్రాఫిక్), జి.శ్రీహరి(మల్కాపురం), కె.ప్రసాద్(మల్కాపురం), టి.కామేశ్వరరావు(ఆనందపురం క్రైం)తో పాటు ఏసీబీ హెచ్‌సీ టి.కొండలరావు ఈ సేవా పతకానికి ఎంపికయ్యారు. అదే విధంగా కానిస్టేబుళ్లు జి.ప్రసాద్(ఏఆర్), కె.ఎన్.స్వామి(ఏఆర్), జి.శ్రీనివాసరావు(ఏఆర్), వి.దశరావు(ఏఆర్), ఎం.గోవిందరావు(ఏఆర్), పి.సన్యాసిరావు(ఏఆర్), ఎన్.బి. వెంకటేశ్వర్లు(వన్‌టౌన్ క్రైం), ఇ.మునిరాజు(ఏఆర్), ఎస్.ఎరిబాబు (ఏఆర్), బి.శ్రీధర్(ఏఆర్), ఎం.వీరబాబు(ఏఆర్), కె.చిన్నయ్య(ఏఆర్), ఎం.ప్రసాదరావు(ఏఆర్), పి.చిన్న బొజ్జియ్య ఎంపికయ్యారు.

అతి ఉత్కృష్ట సేవా పతకానికి ఎంపికైన వారు..

న్యూపోర్ట్ ట్రాఫిక్ ఎస్ఐ పి.రాజు, హెచ్‌సీలు కె.వైకుంటరావు (ఏఆర్), ఆర్.మాధవరావు(ఏఆర్), టి.రాము (ఆనందపురం ట్రాఫిక్), జె.వెంకటరవి(ఏఆర్), పి.వరహాలు(దువ్వాడ), ఎ.రమణారావు(సీసీఎస్), జి.శ్రీనివాసరావు(టూ టౌన్ ట్రాఫిక్), కె.బాబా అమర్ శేఖర్ (సీఎస్‌బీ), కె.ఈశ్వరరావు(గాజువాక క్రైం), వి.కనకరావు(ఏఆర్), ఎస్.కె.సుభాన్(సీఎస్‌బీ), జి.రామారావు(ఏఆర్), బి.ఎస్.మూర్తి(ఎంవీపీ)తో పాటు 16వ బెటాలియన్ హెచ్‌సీలు బి.రామానుజులు, పి.కోటేశ్వరరావు, కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌లో హెచ్‌సీ ఎం.సన్యాసిరావు ఈ పతకానికి ఎంపికయ్యారు.

వర్షాభావ పరిస్థితుల్లోనూ నిరంతర విద్యుత్



సమావేశంలో మాట్లాడుతున్న ఈఈ మహేంద్రనాథ్

దొండపర్తి : వర్షాభావ పరిస్థితుల కారణంగా విద్యుత్ డిమాండ్ పెరిగినప్పటికీ నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసినట్లు ఏపీఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీర్ ఎల్.మహేంద్రనాథ్ తెలిపారు. శుక్రవారం సర్కిల్ ఆఫీస్ సమావేశ మందిరంలో హెచ్‌టీ విద్యుత్ వినియోగదారుల సమావేశం నిర్వహించారు. ఉమ్మడి విశాఖలో అన్ని ప్రాంతాల నుంచి సుమారు 100 మందికి పైగా వినియోగదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతల కారణంగా అత్యధికంగా 1616 మెగావాట్ల విద్యుత్ వినియోగం రికార్డు అయినట్లు వివరించారు. విద్యుత్ లోటును సర్దుబాటు చేసేందుకు పరిశ్రమల విద్యుత్ వినియోగదారులకు ఇచ్చిన నోటీసులు ఉపసంహరించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం వర్షాలు కురవడంతో విద్యుత్ సరఫరా పరిస్థితి మెరుగుపడడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అచ్యుతాపురం ఎస్ఈజెడ్ నుంచి కొంత మంది హెచ్‌టీ వినియోగదారులు విద్యుత్ అంతరాయాలపై సందేహాలు వ్యక్తపరచగా వాటిని అధికారులు నివృత్తి చేశారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన

మధురవాడ: ప్రభుత్వం ఇచ్చిన సర్క్యులర్ ప్రకారం జీతాలు ఇవ్వాలని వినతి పత్రం ఇచ్చిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఎస్.పద్మను విధుల నుంచి తొలగించడం అన్యాయమని ఏపీఎస్ ఆర్టీసీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల యూనియన్(సీఐటీయూ) గౌరవాధ్యక్షుడు వి.తులసీరామ్ అన్నారు. మేనేజ్‌మెంట్ కక్ష సాధింపు చర్యను వ్యతిరేకిస్తూ మధురవాడ ఆర్టీసీ డిపో వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్ ఆర్టీసీ నిర్ణయించిన జీతాలు ఇవ్వకపోయినా మేనేజర్ పట్టించుకోవట్లేదని ఆరోపించారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం డిపో మేనేజర్ ఉమా మహేశ్వరరెడ్డికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో జోన్ అధ్యక్ష, కార్యదర్శులు డి.అప్పలరాజు, కొండమ్మ, రాజ్‌కుమార్, ఆర్టీసీ డిపో నాయకులు బీఎస్ నారాయణ, భాస్కరరావు, ఎస్.పద్మ, పి.సాగర్ పాల్గొన్నారు.